క్లుప్తంగా

క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోండి

పెద్దకడబూరు : ప్రధానమంత్రి టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పేద క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకునేందుకు దాతలు ముందుకు రావాలని సీహెచ్ఓ ఆదినారాయణ కోరారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్‌స్టాఫ్ సహకారంతో మంగళవారం పేద టీబీ వ్యాధిగ్రస్తులకు సుమారు ఒక్కొక్కరికి రూ. వెయ్యిలు విలువ చేసే పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు లక్ష్మినరసమ్మ, కిశోర్, పీహెచ్ఎన్‌లు సుశీల, బాబురాజు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రాగన్ పడవ పోటీల్లో పతకాలు


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ విద్యార్థి కర్నూలులో జరిగిన డ్రాగన్ పడవ పోటీల్లో స్వర్ణ, కాంస్య, రజత పతకాలను సాధించాడు. ఈ మేరకు మంగళవారం కాలేజీలో ప్రిన్సిపాల్ డా. సుధాకర్ విద్యార్థిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ కాలేజీలో సెకండ్ బీటెక్ ఈఈఈ చదువుతున్న సరేంద్ర అనే విద్యార్థి డ్రాగన్ పడవ పోటీల్లో 500 మీటర్ల సీనియర్ మెన్స్, 200 మీటర్ల సీనియర్ మెన్స్, 500 మీటర్ల జూనియర్ మెన్స్‌లో ప్రతిభను కనపరచి పతకాలను సాధించాడన్నారు. విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు కాలేజీ అధ్యాపక బృందం సభ్యులు అభినందించారు.

పట్టపగలే చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని గూడూరు రోడ్డులో ఉన్న ఓ ఇంట్లో మంగళవారం దొంగలు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. గూడూరు రోడ్డులో నివాసముంటున్న మహబుబ్ అనే వ్యక్తి సున్నం బట్టీల ప్రాంతంలో కిరాణం దుకాణం నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసి ఇంటికి తాళం వేసి దుకాణానికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి వెళ్లి బీరువాలో ఉన్న రూ. 20 వేలు నగదును ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన మహబుబ్ ఇంటి తాళం పగలగొట్టి ఉండటం గమనించి పట్టణ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వెళ్లి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు.

ఆదాయ వనరులు పెంచుకోవాలి

గోనెగండ్ల : గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందేందుకు ఆదాయ వనరులను పెంచుకోవాలని ఎంపీడీఓ మణి మంజరి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఓఎస్ఆర్(గ్రామ పంచాయతీలకు సొంత వనరులు పెంచుకోవటం)పై గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహాత్మగాంధీ, వాల్మీకి మహర్షి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


ధీరజ్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: రాష్ట్ర స్థాయిలో జరిగే ఫుట్ బాల్ క్రీడా పోటీలకు ఎస్ ఎల్వి ధీరజ్ ఎంపికై నట్లు అక్షరశ్రీ పాఠశాల కరస్పాండెంట్ మేఘనాథ రెడ్డి, ప్రిన్సిపాల్ రఘు మంగళవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కర్నూలులోని ప్రభుత్వ బాలికల కళాశాల మైదానంలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికై నట్లు చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడు షాషావలి, ఉపాధ్యాయులు వెంకటేష్, భాస్కర్ నాయుడు తదితరులు ధీరజ్‌ను అభినందించారు.

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు

ఆదోని సెంట్రల్: విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ రామస్వామి సూచించారు. ఆదోని పట్టణంలోని రూట్స్ గ్లోబల్ జూనియర్ కాలేజ్, కేశవ నారాయణరెడ్డి, జ్యోతిర్మయి జూనియర్ కాలేజీలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. గుట్కా, మద్యం, గంజాయి, కొకైన్ లాంటి వాటిని తీసుకోవడం వల్ల జీతాలు నాశనమవుతాయన్నారు. హెడ్‌కానిస్టేబుల్ ఎలిషా పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: కౌతాళం మండలం కరణి గ్రామానికి చెందిన హరిజన ఉసేని అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ రెడ్డి తెలిపారు. మంగళవారం కోసిగి మండలం అగసనూరు నుంచి కందుకూరు మీదుగా బైక్ పై అక్రమ మద్యం తీసుకెళ్తుండగా ఆర్చ్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 480 ఒరిజనల్ ఛాయిస్ టెట్రా ప్యాకెట్స్ (90ఎంఎల్) స్వాధీనం చేసుకున్నామన్నారు. బైక్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ కిశోర్ కుమార్, భరత్, రవికుమార్, తిక్కయ్య, మునిరంగడు తదితరులు పాల్గొన్నారు.


కోసిగిలో ర్యాలీ చేపడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి


పెద్దకడబూరులో నివాళలర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, వాల్మీకి సోదరులు


ఎమ్మిగనూరులో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ తదితరులు


నందవరంలో మహర్షి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలి

ఆదోని టౌన్: వాల్మీకి మహర్షి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని వాల్మీకులు ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా పట్టణంలోని వాల్మీకి నగర్‌లో ఉన్న వాల్మీకి మహర్షి దేవాలయాన్ని మంగళవారం సందర్శించి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీతో పాటు ఆలయ కమిటీ సభ్యులు బాబు, వెంకటేష్, దేవా, ముని మాట్లాడారు. వాల్మీకులు దేశమంతా ఎస్టీలుగా ఉన్న మన రాష్ట్రంలో మాత్రం గతంలో కొంత మందిని ఎస్టీలుగా, మైదాన ప్రాంతంలో బీసీ-ఏగానూ చేయడం జరిగిందన్నారు. ఒకే రాష్ట్రంలో ఇంతటి ఘోరం ఏ కులానికి జరగలేదన్నారు. వాల్మీకులందరూ కూడా ఏకతాటిపై నడుస్తూ ఎస్టీ అజెండాగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్యాంకు మల్లి, శీన, పక్కీరప్ప, జైరామ్, నాగేంద్ర, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- ఆదోని సెంట్రల్: పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫయాజ్ బాషా అధ్యక్షతన జరిగిన వాల్మీకి జయంతి వేడుకల్లో ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రమణారెడ్డి పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో రామయణం గురించి చక్కగా వివరించిన 10వ తరగతి విద్యార్థిని గౌతమిని హెచ్ఎం మల్లికార్జున, ఉపాధ్యాయులు అభినందించి బహుమతి అందించారు.
- మిల్టన్ పాఠశాల కరస్పాండెంట్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ నాగరాజు సిఈఓ వెంకటేశ్వర్లు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా వాల్మీకి జయంతి

కోసిగి: స్థానిన వైఎస్సార్ సర్కిల్‌లోని వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద కోసిగి వాల్మీకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అక్కడ నుంచి వాల్మీకి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కందుకూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పరిమళ దేవి ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వాల్మీకి, వైఎస్సార్ సీపీ నాయకులు ఈరన్న, నాడుగేని నాగరాజు, సుందర రాజు దొర, ముకుంద క్రిష్ణమూర్తి, బుల్లి నరసింహులు, దళవాయి మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వాల్మీకి నాయకులు


ఎమ్మిగనూరులో మహర్షి వాల్మీకి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ నాయకులు

ఆదర్శ ప్రాయుడు వాల్మీకి

ఎమ్మిగనూరుటౌన్: మహర్షి వాల్మీకిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని, మార్పును ఏవిధంగా తీసుకొని రావచ్చునో ఆయన రచించిన రామాయణం చెబుతోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక అన్నారు. మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని వాల్మీకి విగ్రహానికి పార్టీ నాయకులు బుట్టా శివనీలకంఠ, కేఆర్ మురహరి రెడ్డి, బీఆర్ బసిరెడ్డి, కేవీ, కృష్ణారెడ్డి, వీజీఆర్ కొండయ్య, వెంకటాపురం బోయబజారి తదితర పార్టీ శ్రేణులతో పూలమాల వేసి నివాళులర్పించారు. అంత కుమునుపు స్థానిక పార్టీ కార్యాలయం నుండి వాల్మీకి సర్కిల్ వరకు బైక్ ర్యాలీని పార్టీ శ్రేణులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తాను కర్నూలు ఎంపీగా పనిచేసినప్పుడు మాజీ సీఎం వైఎస్ జగనన్న ఆదేశాల మేరకు పార్లమెంట్‌లో ప్రస్తావించడం జరిగిందని గుర్తు చేశారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆమె ఈ సందర్భంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ వాల్మీకి విభాగం నాయకులు బోయ రాజు, గడ్డం అంజి, సోమేష్, పామయ్య, జగ్గాపురం నర్సరాజు, మణి, కోతి ఈరన్న, దొరబాబు నాయుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకికి ఘన నివాళి: పట్టణంలోని మహర్షి వాల్మీకి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి వాల్మీకి విగ్రహం వరకు పార్టీ శ్రేణులతో ర్యాలీగా వచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కేశన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు భీమిరెడ్డి, కోటేకల్ లక్ష్మన్న, కడివెళ్లరంగస్వామి, వైస్ ఎంపీపీ పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రంలని వాల్మీకి మహర్షి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మంత్రాలయం సీఐ రామాంజులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లబండ్ల బీమయ్య, వైస్ సర్పంచ్ హోటల్ పరమేష్, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, జనార్దన్ రెడ్డి, రఘు, రచ్చుమర్రి బొజ్జప్ప, నరసింహ, పేగుల రాము, వాల్మీకి నాయకులు బీసీ తిమ్మప్ప, సుంకప్ప తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : వాల్మీకి మహర్షి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. వాల్మీకి జయంతి పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహానికి, మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో ఏర్పాటు చేసుకున్న వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఈరన్న, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు యల్లప్ప, నాయకులు రామలింగారెడ్డి, వాల్మీకి సోదరులు బాబు, సత్యన్న, ఆంజనయ్య, ఈరన్న, దస్తగిరి, మబ్బు ఆంజనేయ తదితరులు పాల్గొన్నారు.


మంత్రాలయంలో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి

- గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లతో పాటు గంజిహళ్లి, హెచ్ కైరవాడి, పుట్టపాశం, అలువాల, పెద్దనేలటూర్, చిన్ననేలటూర్, వేముగోడు తదితర గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను వాల్మీకులు ఘనంగా నిర్వహించారు. గోనెగండ్లలో వాల్మీకి మహర్షి చిత్రపటంతో అంజినేయ స్వామి దేవాలయం నుంచి శ్రీ రాముల దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి పూజలు చేసి వాల్మీకులకు ప్రసాదం పంపిణీ చేశారు. అలువాల గ్రామంలో వాల్మీకి మహర్షి చిత్రపటంతో అంజినేయ స్వామి దేవాలయం నుంచి కాశీ వీరప్ప మఠం వరకు ఊరేగింపుగా వెళ్లారు. కార్యక్రమంలో వాల్మీకులు రవి కుమార్ నాయుడు, తిరుపతయ్య, గోవింద్, రంగముని తదితరులు పాల్గొన్నారు.
- నందవరం : వాల్మీకి మహర్షి శ్రీమద్రామాయణం రచించి మనిషి జీవితంలో ఎలా జీవించాలో వివరించారని టీటీడీ హిందూ ధర్మప్రచారపరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వహకులు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రం నందవరంతో పాటు కనకవీడు, మాచాపురం, హాలహర్వి, తదితర గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.


నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉప విద్యాధికారి వెంకటరమణా రెడ్డి


ఆదోని పురపాలక ఉన్నత పాఠశాలలో వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


వాల్మీకి జయంతి వేడుకల్లో మంత్రాలయం సీఐ రామాంజులు


గోనెగండ్లలో వాల్మీకి చిత్రపటంతో ఊరేగింపుగా వెళ్తున్న వాల్మీకులు

సీజేఐపై దాడిచేసిన వారిని శిక్షించాలి

ఆదోని రూరల్: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై దాడిని వ్యతిరేకిస్తూ మంగళవారం ఆదోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఆదోని బార్ అసోసియేషన్ కార్యదర్శి జీవన్‌సింగ్ మాట్లాడుతూ ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇకపై ఇలాంటి దాడులు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఇస్మాయిల్, దేశాయ్, యాజీ శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: సుప్రీం కోర్టులో సీజేఐ బీఆర్. గవాయ్ పై దాడికి పూనుకొన్న న్యాయవాది కిషోర్ రాకేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ మండల అధ్యక్షుడు సప్పపోగు తిమ్మన్న, చర్మకారుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సుమాల ఆథోని డిమాండ్ చేశారు. మంగళవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని సోమప్పసర్కిల్‌లో ఆందోళన చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు గుంటెప్ప, రాజారమేష్, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదోని బార్ అసోసియేషన్ కార్యదర్శి జీవన్‌సింగ్

కేజీబీవీకి విరాళం

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని చిలకలడోణ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి మైక్‌సెట్ కోసం మండల కన్వీనర్ భీమారెడ్డి నగదును విరాళం అందించారు. మంగళవారం స్థానిక కేజీబీవీలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఉపాధ్యాయినులకు రూ.20 వేలు నగదును భీమారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వీకేసీ రాఘవేంద్ర అందజేశారు.


ఉపాధ్యాయినులకు నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమారెడ్డి

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

ఆదోని రూరల్: పట్టణంలో వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఇళ్లలోకి నీరు చేరి నష్టపోయిన పేద కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం పట్టణ కార్యవర్గ సభ్యులు తిప్పన్న, డీవైఎఫ్ఐ కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్ బాబుకు వినతి పత్రం అందించారు.

పెద్దకడబూరు : అధిక వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, సహాయకార్యదర్శి చంద్ర నేతృత్వంలో ఏఐకేఎస్, సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నాగేష్, గోపాల్, గంగన్న పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

ఆదోని రూరల్: ఆశావర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి వీరారెడ్డి, ఏపీ ఆశావర్కర్ల యూనియన్ లతా, రాజేశ్వరి, లావణ్య, సుకన్య డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పెద్దతుంబలం, పెద్దహరివాణం పీహెచ్‌సీల్లో వైద్యాధికారులకు ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని వైద్యాధికారులకు వినతి పత్రం అందించారు.

ఎమ్మిగనూరుటౌన్: ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌లో అధికారికి వినతి పత్రాన్ని ఇచ్చారు.

ఎమ్మిగనూరురూరల్: దైవందిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా వర్కర్ల యూనియన్, సీఐటీయూ అనుబంధం జిల్లా కార్యదర్శి శివలక్ష్మి ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు.

సచివాలయాలకు సర్వీసు పేపర్ల పంపిణీ

సాక్షి ఎఫెక్ట్

నందవరం : మండల కేంద్రంలోని సచివాలయాలు-1,-2,-3లకు ఎంపీడీఓ కృష్ణమూర్తి సర్వీసు పేపర్లను పంపిణీ చేశారు. సోమవారం సాక్షి దినపత్రికలో 'సర్వీసు పత్రాలు లేక నిలిచిన సచివాలయ సేవలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించి మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ సందీప్ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులకు సర్వీసు పత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ.. సచివాలయాలకు సర్వీసు పేపర్లు అందించి, సేవలు పునరుద్ధరించామని తెలిపారు. సచివాలయ ఉద్యోగులు సర్వీసు పత్రాలు అయిపోయే ముందే ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.


నందవరంలో సచివాలయ ఉద్యోగులకు సర్వీసు పేపర్లను అందజేస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

ట్రాలీ ఆటో ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తి

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని చెన్నాపురం గ్రామం క్రాస్ రోడ్డు సమీపంలో మంగళవారం రాత్రి ట్రాలీ ఆటో ఢీ కొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆదోని నుంచి ఎమ్మిగనూరు వైపు వస్తున్న వ్యాన్ రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు రాత్రి తెలిపారు. మృతుడి గురించి ఎవరికైన తెలిస్తే రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని చెటన్నహళ్లి గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కర్ణాటక భక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు .. బెంగళూరుకి చెందిన భక్తులు వేణుగోపాల్, రాధ, షాలిని, సహదేవలు రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై మంత్రాలయానికి విచ్చేశారు. మంగళవారం స్వామిని దర్శించుకుని పక్కనే ఉన్న పంచముఖి, బిచ్చాలకు దైవ దర్శనానికి ఆటోలో బయలు దేరారు. స్వాములను దర్శించుకుని తిరుగు ప్రయాణంలో మండల పరిధిలోని చెట్నహళ్లి గ్రామ సమీపంలోని నిలిచి ఉన్న బుల్లేరా వాహనానికి వెనుక భాగంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వేణుగోపాల్, రాధ, షాలిని, సహదేవలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి విచారణ చేపట్టినట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఇద్దరికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఆదోని రోడ్డు జాతీయ రహదారిలో అగ్నిమాపక కేంద్రం సమీపంలో మంగళవారం మోటార్ బైక్, బొలెరో వాహనం ఢీ కొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీకి చెందిన మదన్‌సింగ్, జగ్గాపురంకు చెందిన వెంకటేశ్వర్లు ఆదోని నుంచి ఎమ్మిగనూరుకు వస్తుండగా పట్టణంలో నుంచి ఆదోని రోడ్డులోని షెడ్ వద్దకు వెళ్తున్న బొలేరో ఎదురుదెరుగా ఢీ కొనడంతో బైక్‌పై ఉన్న వెంకటేశ్వర్లు, మదన్‌సింగ్‌లకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(సీఈసీ) మెంబర్‌గా నియామకమైన మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో పార్టీ రైతు సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు శాంతిరాజు, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి తదితరులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు వైస్ ఎంపీపీ పోలయ్య, నాయకులు బుజ్జిబాబు, అనందరాజు, షకరప్ప, అబ్రహం, గుడికల్ భాస్కర్, నర్సన్నాచారి, నాగేష్, గోనెగండ్ల మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు గంజిహళ్లి తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సత్కరిస్తున్న పార్టీ నాయకులు

వైద్యుల డిమాండ్లు పరిష్కరించాలి



వైద్యులకు మద్దతుగా గోనెగండ్ల ఆస్పత్రి ఎదుట నిరసన తెలియజేస్తున్న వైద్య సిబ్బంది

గోనెగండ్ల : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సీహెచ్ఓ మేరిగోల్డ్, ఎంపీహెచ్ఈఓలు హనుమంతు, సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం గోనెగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులకు మద్దతుగా సీహెచ్ఓ, ఎంపీహెచ్ఈఓలు, ఎంపీహెచ్ఎస్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్నా పీహెచ్‌సీ వైద్యులకు పదోన్నతులు లేవన్నారు. పొరుగు రాష్ట్రాల్లో టైమ్ బౌండ్ ప్రమోషన్లు కల్పిస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం ఈ విధానం అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మికాంతమ్మ, శాంతమ్మ, పీహెచ్ఎన్ భారతి విజయలక్ష్మి పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించండి

నందవరం : పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు జీఎస్టీ తగ్గింపుపై పేదలకు అవగాహన కల్పించాలని సేల్స్‌టాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ వెంకటరమణ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు జీఎస్టీ, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం జీఎస్టీని గతంలో 4 స్లాట్లుగా విభజించిందని, ప్రస్తుతం 2 స్లాట్లకు కుదించిందని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రామారావు, నౌసన్న, పెద్దిరెడ్డి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సేల్స్‌టాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ వెంకటరమణ

ఎమ్మిగనూరుటౌన్: జీఎస్టీ తగ్గింపుపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా తెలిపారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీపై అవగాహన కల్పించారు.

వికసించిన బ్రహ్మకమలం



పెద్దకడబూరు : బ్రహ్మ కమలం ఈ పేరు చెబితే చాలా మందికి ఇది ఒక్క హిమాలయ పర్వత ప్రాంతాలలో మాత్రమే కనిపించే అరుదైన పుష్పమని గుర్తుకు వస్తుంది. సాధారణంగా సంవత్సరంలో ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే వికసించే ఈ పుష్పం రాత్రి సమయాల్లో మాత్రమే పూసి ఉదయానికి వాడిపోతుంది. ఈ క్షణాలకు చాలామంది శుభసూచకంగా భావించి ప్రత్యేక ప్రార్థనలు కూడా చేస్తారు. పెద్దకడబూరు మండల కేంద్రంలోని శ్రీశ్రీ ముద్దురంగా గురువుల మఠం ఆలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి బ్రహ్మకమలం వికసించి అందరినీ ఆకట్టుకుంది. పీఠాధిపతులు నారాయణస్వామి దంపతులు బ్రహ్మ కమలానికి ప్రత్యేక పూజలు చేశారు.